సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


బుధవారం । 17 । మే । 2023



ప్రాణాలు తీసిన పంక్చర్


హాయిగా.. సాఫీగా సాగిపోతున్న ప్రయాణంలో ఒక్కసారిగా పెద్ద కుదుపు.. టైరు పంక్చరవడంతో జరిగిన ప్రమాదంలో కారులోని ముగ్గురు మృతి చెందారు.

- 8లో



6,159 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 6,159 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.45 అడుగులకు చేరింది.



నగరం	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవం	48.5	27.5
కాకినాడ	43.8	28.0
అమలాపురం	43.8	28.0

న్యూస్‌రీల్

జాతీయ వాలీబాల్‌కు ఎంపిక



శ్రీసంజనాదేవి

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోదాసి శ్రీసంజనాదేవి 45వ సబ్ జూనియర్ జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల రాజహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో శ్రీసంజనాదేవి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరఫున పాల్గొంది. ఉత్తమ ఆట తీరుతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ గొలకోటి ఫణీంద్ర మంగళవారం తెలిపారు. ఈ నెల 25 నుంచి జూన్ 1వ తేదీ వరకూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని చందర్ మాగూర్, హుగ్లీలో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో శ్రీసంజనాదేవి రాష్ట్ర జట్టు నుంచి పాల్గొంటుందని ఆయన తెలిపారు. పాఠశాల కీర్తిని జాతీయ స్థాయికి తీసుకు వెళ్లిన శ్రీసంజనాదేవిని ఎంఈఓ కె.కిరణ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు ఎల్.రాణి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దోనిపాటి రమా వెంకటరమణ తదితరులు అభినందించారు.

పొలం వెళ్లి వచ్చి.. కుప్పకూలి..

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన ర్యాలి శ్రీనివాసరావు (40) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఉదయం పొలం వెళ్లి, తిరిగి వచ్చిన అతడు ఒక్కసారిగా ఇంటి వద్ద కుప్పకూలిపోయి మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి ఆర్ఐ భవాని వెళ్లి వివరాలు సేకరించారు. త్రీమెన్ కమిటీ నిర్ధారించిన అనంతరం మృతికి కారణాలు తెలుపుతామని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిన్నామన్నారు.

రత్నగిరిపై 'ఖుషీ 'షూటింగ్



సినిమా షూటింగ్‌కు హాజరైన విజయ్ దేవరకొండ

అన్నవరం: విజయ్ దేవరకొండ, సమంత హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న 'ఖుషీ' సినిమా షూటింగ్ అన్నవరం సత్యదేవుని ఆలయ పరిసరాల్లో మంగళవారం జరిగింది. పాన్ ఇండియా స్థాయిలో రొమాంటిక్ కామెడీ చిత్రంగా తీస్తున్నట్లు సినిమా వర్గాలు తెలిపాయి. స్వామివారి వార్షిక కల్యాణ వేదిక ముందు క్యారెక్టర్ ఆర్టిస్టు మురళీశర్మ ప్రవచనకర్త శ్రీనివాసరావుగా స్వామివారి కల్యాణంలో పాల్గొని ప్రవచనం చెప్పడం, ఆ కార్యక్రమానికి విజయ్ దేవరకొండ హాజరవడం, వారిద్దరి మధ్య కొన్ని సంభాషణలను సినిమా దర్శకుడు శివ నిర్వాణ చిత్రీకరించారు. ఎక్కువ మంది జూనియర్ ఆర్టిస్టులు షూటింగ్‌లో పాల్గొన్నారు. హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండపై కొన్ని సీన్లు బుధవారం చిత్రీకరించనున్నట్లు సినిమా వర్గాలు తెలిపాయి. సినిమాను మైత్రి మూవీస్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ హేసమ్ అబ్దుల్ వాహెద్. వెన్నెల కిషోర్, మురళీ శర్మ తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నారు.

అడ్మిషన్లకు శ్రీకారం

- ఇంటర్ ప్రవేశాలు ప్రారంభం
- వచ్చే నెల 14 వరకూ మొదటి విడత
- జూనియర్ కళాశాలల్లో దరఖాస్తుల విక్రయం మొదలు
- వచ్చే నెల 1 నుంచి తరగతులు

రాయవరం: ఇంకా కళాశాలలు ప్రారంభం కాకుండానే ఈ ఏడాది ఇంటర్మీడియెట్ అడ్మిషన్లను ప్రభుత్వం ప్రారంభించింది. గత ఏడాది వరకూ కళాశాలల ప్రారంభం తర్వాత ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేవారు. దీనికి భిన్నంగా 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రవేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల, సాంఘిక సంక్షేమ తదితర యాజమాన్యాల పరిధిలో జనరల్, వృత్తి విద్యా కోర్సులలో అడ్మిషన్లకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభం కాగా.. వచ్చే నెల 14వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ 14, గురుకులం, సాంఘిక సంక్షేమం, ప్రైవేటు తదితర యాజమాన్యాల పరిధిలో 86 చొప్పున జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ వంద కళాశాలల్లో జనరల్ 11,114 మంది, ఒకేషనల్ 2,624 మంది కలిపి మొత్తం 13,738 మంది ఫస్టియర్ విద్యార్థులు ఉన్నారు. వీరందరూ ఇప్పుడు సెకండియర్‌కు వస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో పదో తరగతి పరీక్షలు 19,007 మంది రాయగా, వీరిలో 13,915 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్నారు. తొలి విడతలో రెగ్యులర్‌గా పాసైన విద్యార్థులు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర కోర్సులలో చేరనున్నారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా ఇంటర్‌లో రెండో విడతలో అడ్మిషన్లు పొందనున్నారు.

కళాశాలల వద్దే దరఖాస్తులు

జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు కళాశాలల వద్దే దరఖాస్తులు పొందాల్సి ఉంది. పూర్తి చేసిన దరఖాస్తులను తిరిగి అక్కడే అందజేయాలి. కళాశాల సామర్థ్యాన్ని బట్టి నాలుగు నుంచి తొమ్మిది సెక్షన్ల వరకూ ఉంటాయి. ప్రైవేటు కళాశాలల్లో మౌలిక సదుపాయాల ఆధారంగా ప్రభుత్వం అదనపు సెక్షన్లు మంజూరు చేస్తుంది. జూనియర్ కళాశాలల్లో జనరల్, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. దాదాపు అన్ని కళాశాలల్లోనూ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులున్నాయి.

తలుపు తడుతున్న అధ్యాపకులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలంటూ అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ మండే ఎండను కూడా లెక్క చేయకుండా విద్యార్థుల ఇళ్ల తలుపులు తడుతున్నారు. తమ కళాశాలల్లో లభిస్తున్న కోర్సులు, అధ్యాపకుల వివరాలను తల్లిదండ్రులకు, విద్యార్థులకు తెలియజేస్తున్నారు. నామినల్ ఫీజుతో ప్రభుత్వ కళాశాలల్లో లభిస్తున్న మాధ్యమిక విద్య, వసతులు, సౌకర్యాల గురించి వివరిస్తున్నారు.



కె.గంగవరం మండలం అముజూరులో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, తమ కళాశాల గురించి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రిజర్వేషన్ పాటించాల్సిందే..

ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి. ప్రతిభ కలిగిన విద్యార్థులకు అన్యాయం జరగకుండా రోస్టర్ ప్రాతిపదికన అత్యంత పారదర్శకంగా ఇంటర్మీడియెట్ సీట్లు భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పదో తరగతిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 29 శాతం, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు 3 శాతం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా కింద 5 శాతం, ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం, మిగిలిన సీట్లు ఇతరులకు కేటాయిస్తారు. దరఖాస్తుల విక్రయాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి



ఇంటర్మీడియెట్ అడ్మిషన్ల ప్రక్రియలో ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వం సూచించిన నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ప్రభుత్వ గుర్తింపు ఉన్న కళాశాలల్లో మాత్రమే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. పాత విధానంలోనే కళాశాలల్లో నేరుగా ప్రవేశం పొందవచ్చు.

– ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, ఆర్ఐఓ, ఇంటర్మీడియెట్ బోర్డు, రాజమహేంద్రవరం

ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి



ప్రభుత్వ కళాశాలల్లో నిపుణులైన అధ్యాపకులు బోధిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మెరుగైన ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వం నాడు – నేడు పథకంలో కళాశాలలను అభివృద్ధి చేసింది. అందువలన పేద, మధ్య తరగతి విద్యార్థులందరూ ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి.

– ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి, డీవీఈఓ, అమలాపురం

సమన్వయంతో డెంగీ నివారణ



జేసీ ధ్యానచంద్ర

అమలాపురం రూరల్: వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో డెంగీ జ్వరాలను నివారించవచ్చని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ఆయన చాంబర్‌లో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, ఖాళీ ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని, తద్వారా డెంగీ వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు. నిల్వ నీరు అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి, ఫాగింగ్, స్ప్రేయింగ్‌తో పాటు ఆయిల్ బాల్స్ వంటివి వేయడం ద్వారా దోమలను నిర్మూలించాలని మున్సిపల్ కమిషనర్లను, పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండపేటలోని హరిజనపేట, రామచంద్రపురం రాజబాబు నగర్, శాంతినగర్ ప్రాంతాల్లో ఎక్కువగా డెంగీ కేసులు వచ్చే అవకాశం ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంట్లోను, ఆరుబయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగీ నిర్ధారణకు అమలాపురం, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రుల్లో ఎలిసా పరీక్ష చేసే సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో కిటికీలకు మెష్‌లు అమర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డెంగీ నిర్ధారణ అయిన ఆరు గంటల్లోగా వైద్యాధికారులకు లేదా డీఎంహెచ్ఓ కార్యాలయానికి సమాచారం అందజేసేలా ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లకు ఆదేశాలు ఇవ్వాలని డీఎంహెచ్ఓ దుర్గారావుదొరకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 7 కేసులు నమోదయ్యాయని అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా మలేరియా అధికారి భరతలక్ష్మి చెప్పారు. డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

- మంత్రి పినిపే విశ్వరూప్
- మత్స్యకార భరోసా నిధుల జమ
- 9,575 మంది లబ్ధిదారులకు రూ.9.58 కోట్లు
- ఓఎన్‌జీసీ పరిహారం రూ.107 కోట్ల అందజేత

ముమ్మిడివరం/కాట్రేనికోన: మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం కింద వేట నిషేధ పరిహారాన్ని, ఓఎన్‌జీసీ కార్యకలాపాలతో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు పరిహారాన్ని వారి ఖాతాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాపట్ల జిల్లా నిజాంపట్నం నుంచి మంగళవారం జమ చేశారు. మత్స్యకార దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మత్స్యకారులు కాట్రేనికోనలో నిర్వహించిన సభలో వర్చువల్‌గా వీక్షించారు. సభ ముగిసీ ముగియకుండానే తమ ఖాతాల్లో పరిహారం జమ అయినట్టు తమ మొబైల్ ఫోన్లకు వచ్చిన మెసేజీలు చూసుకుని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. 'దటీజ్ సీఎం జగన్' అంటూ ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు మూడేళ్లుగా అందించిన సాయాన్ని గణాంకాలతో వివరించారు. మరో ముఖ్య అతిథి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, ఇచ్చిన మాటలకు కట్టుబడి, సీఎం జగన్ ప్రత్యేక చొరవతో ఓఎన్‌జీసీని ఒప్పించి, మత్స్యకారులకు పరిహారం అందించారని అన్నారు. చమురు, సహజవాయువు కార్యకలాపాల వల్ల నష్టపోయిన తీర ప్రాంత మత్స్యకార కుటుంబాలను ఆయా సంస్థలు ఆర్థికంగా మరింత ఆదుకోవాలని మంత్రులు సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్.. వేట విరామ పరిహారాన్ని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి, ఏటా క్రమం తప్పకుండా అందిస్తున్నారని అన్నారు. డీజిల్ సబ్సిడీ పెంపు, కొత్త ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటు, పాతవాటి ఆధునీకరణ, ఫిష్ ఆంధ్రాలో ఆక్వా హబ్‌ల వంటి వాటితో మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మత్స్యకారులు రుణపడి ఉంటారని అన్నారు. నిజాంపట్నంలో హార్బర్, ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. అనంతరం జిల్లాకు సంబంధించి 9,575 మత్స్యకార కుటుంబాలకు రూ.9.58 కోట్ల మేర వేట నిషేధ పరిహారం, ఓఎన్‌జీసీ మూడో విడత పరిహారం రూ.107 కోట్లకు సంబంధించిన మెగా చెక్కులను అతిథులు విడుదల చేశారు. అలాగే మత్స్యకారుల జీవనోపాధికి వినియోగించే యంత్ర పరికరాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సభకు నియోజకవర్గంలోని 63 మత్స్యకార గ్రామాల ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. 'మా దేవుడు పొన్నాడ' అంటూ ప్లకార్డులు చేతబూని వైఎస్సార్ సీపీ పతాకాలు పట్టుకుని 'జై పొన్నాడ – జై జై జగనన్న' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సభలో ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం, రాజోలు ఎమ్మెల్యేలు కొండేటి చిట్టిబాబు, రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



మత్స్యకార భరోసా, ఓఎన్‌జీసీ పరిహారం మెగా చెక్కులను విడుదల చేస్తున్న మంత్రులు విశ్వరూప్, వేణు, ఎంపీ అనురాధ, ఎమ్మెల్యేలు పొన్నాడ, కొండేటి, జేసీ ధ్యానచంద్ర తదితరులు



సభకు తరలివచ్చిన ప్రజలు

ఎమ్మెల్సీ కుడుపూడికి అపూర్వ స్వాగతం

- గోపాలపురం నుంచి అమలాపురానికి భారీ ఊరేగింపు
- 40 కిలోమీటర్లు సాగిన విజయోత్సవ ర్యాలీ

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా సొంత జిల్లాలో అడుగు పెట్టిన ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావుకు అపూర్వ స్వాగతం లభించింది. ఎమ్మెల్సీగా అమరావతిలో సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన ఆయన మంగళవారం ఉదయం జిల్లాకు బయలుదేరారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి స్వగ్రామం గోపాలపురంలోని ఆయన ఇంటికి చేరుకున్నారు. అక్కడి నుంచి వైఎస్సార్ సీపీ, బీసీ నేతలు సూర్యనారాయణరావును అమలాపురానికి ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకూ దాదాపు 40 కిలోమీటర్ల మేర ఈ ఊరేగింపు సాగింది. సూర్యనారాయణరావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ముమ్మిడివరం ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అభినందించారు. గోపాలపురంలో సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు రావులపాలెంలోని కోనసీమ ముఖద్వారం వద్దకు చేరేసరికి సూర్యనారాయణరావుకు ప్రజలు, అభిమానులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అక్కడ దివంగత కళా వెంకట్రావు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే దివంగత చిర్ల సోమసుందరరెడ్డి విగ్రహాలకు సూర్యనారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యాన పార్టీ శ్రేణులు, శెట్టిబలిజ నేతలు భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. ఊరేగింపు ఆద్యంతం ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతోనే మంత్రి విశ్వరూప్ ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, వారిని చట్టసభలకు పంపించడంలో ఎంతో చొరవ తీసుకున్నారని బీసీ నేతలు కొనియాడారు. 'జైజై జగన్', 'సూరి.. జిందాబాద్' అంటూ అడుగడుగునా నినదించారు. రావులపాలెం, కొత్తపేట, ముక్కామల, పుల్లేటికుర్రు, అంబాజీపేట, బండార్లంక, అమలాపురాల్లో సూర్యనారాయణరావుకు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. అంబాజీపేట, అమలాపురంలో పార్టీ కార్యకర్తలు, బీసీ నాయకులు పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, ఉప్పలగుప్తం మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, కోనసీమ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, పార్టీ బీసీ నేతలు గుత్తుల శ్రీనివాసరావు, కుడుపూడి త్రినాథ్, చప్పిడి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



స్వాగత ర్యాలీలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మంత్రి విశ్వరూప్ తదితరులు



రావులపాలెంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుకు స్వాగతం పలుకుతున్న మంత్రి విశ్వరూప్, విప్ జగ్గిరెడ్డి

ముద్రగడ పయనమెటు

- మౌనం వీడిన కాపు ఉద్యమ నేత
- దశాబ్దం తరువాత రాజకీయాల్లోకి..
- పునరాగమనంపై సర్వత్రా ఆసక్తి



ముద్రగడ పద్మనాభం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దశాబ్ద కాలం పాటు రాజకీయాలకు దూరంగా ఉన్న కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మౌనం వీడారు. రాజకీయంగా, ఉద్యమపరంగా సంచలనంగా నిలిచే ఈయన రాజకీయ పునరాగమనానికి ముహూర్తం దగ్గర పడిందా అంటే అవుననే అంటున్నారు సన్నిహితులు. 2016 జనవరి 31న తుని రైలు దహనం కేసులో ముద్రగడతో పాటు మరికొందరిపై నమోదైన కేసును రైల్వే కోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాజకీయ నిర్ణయాన్ని భవిష్యత్‌లో ప్రకటిస్తానని ముద్రగడ లేఖ ద్వారా ప్రకటించారు. ఆ లేఖలో పలు అంశాలు ప్రస్తావించినా భవిష్యత్ రాజకీయ ప్రకటన పైనే అందరి దృష్టీ పడింది. ఆది నుంచీ కాపు ఉద్యమ సారథిగా ముద్రగడకు రాష్ట్రవ్యాప్తంగా ఆదరణ ఉంది. తాతల కాలం నుంచి వచ్చిన రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ వచ్చిన ఈయన ప్రస్తుత కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి 2014లో స్వతంత్ర అభ్యర్థిగా ఓటమి చెందారు. తరువాత నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇన్నేళ్ల తరువాత తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్టు సంకేతాలు ఇవ్వడం రాష్ట్రంలో చర్చనీయాంశమైంది.

అన్ని వర్గాలతో బలమైన బంధం

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా ఏడాది ఉండగానే రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో బలమైన సామాజికవర్గ ప్రతినిధిగా ముద్రగడకు పేరుంది. ఆ సామాజికవర్గం కోసం అనేక ఉద్యమాలు చేశారు. బీసీ, ఎస్సీ నేతలతో కూడా ఆయనకు సత్సంబంధాలున్నాయి. గతంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కొన్ని పోస్టులకు కలత చెందిన ఆయన కాపు సామాజిక ఉద్యమానికి దూరంగా ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ చేపట్టిన ఉద్యమం మహోధృతమైంది. టీడీపీ ప్రభుత్వ పునాదుల్ని కదిలించింది. కాపు ఉద్యమంపై ఉక్కుపాదం మోపిన చంద్రబాబుతో తాజాగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పొత్తుకు సై అన్న తరుణంలో ముద్రగడ తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

జనసేనపై రగులుతున్న యువత

తాజా పరిణామాలు యాదృచ్ఛికంగా జరిగినా రాజకీయాల్లో మాత్రం చర్చకు తెర తీశాయి. జనసేనపై గంపెడాశలు పెట్టుకున్న కాపు సామాజికవర్గం ప్రధానంగా కాపు యువత.. చంద్రబాబుతో దోస్తీ అనేసరికి మండిపడుతోంది. పవన్ నిర్ణయాన్ని తప్పు పడుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటోంది. ఇటువంటి తరుణంలో ముద్రగడ రాజకీయంగా తీసుకునే నిర్ణయం ఎలా ఉంటుందనేది చర్చనీయాంశమైంది. కాపులకు బీసీ రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతో తలపెట్టిన ఉద్యమంలో ముద్రగడ అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాల వైపు మళ్లించలేదు.

ఇదీ రాజకీయ నేపథ్యం

ముద్రగడ తాత పద్మనాభం మునసబుగా పని చేశారు. తండ్రి వీర రాఘవరావు 1962, 67 ఎన్నికల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా పని చేశారు. 1977లో తండ్రి మరణానంతరం పద్మనాభం అదే ప్రత్తిపాడు నుంచి 1978లో జనతా పార్టీ నుంచి తొలిసారి, 1983, 85లో రెండుసార్లు టీడీపీ తరఫున ఎమ్మెల్యే అయ్యారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో పని చేసి, 1988లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, తరువాత మంత్రి అయ్యారు. 1995 ఎన్నికల్లో ముద్రగడ ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి ఓటమి చెంది, 1999లో తిరిగి టీడీపీ నుంచి కాకినాడ ఎంపీ అయ్యారు. 2009లో వైఎస్ హయాంలో పిఠాపురం, 2014లో స్వతంత్ర అభ్యర్థిగా ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. అన్ని ప్రధాన పార్టీల్లో పని చేసిన రాజకీయ అనుభవం ముద్రగడకు ఉంది. పాత, కొత్త తరం నేతలతో రాజకీయాలు నడిపిన నేపథ్యమూ ఉంది.

అభిమానుల ఒత్తిడి: 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పద్మనాభం.. ఓటమి అనంతరం కాపు ఉద్యమాన్ని కొనసాగించారు. తదనంతర పరిణామాల్లో 2020లో ఆ ఉద్యమం నుంచి దూరంగా జరిగారు. రైలు దహనం కేసు కొట్టివేసిన అనంతరం ఆయనకు అభిమానుల తాకిడి పెరిగింది. ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని వారి నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో ముద్రగడ ఏ పార్టీలో చేరుతారు, ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేది ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో హాట్ టాపిక్‌గా మారింది. త్వరలో రాజకీయ ప్రవేశం చేస్తానని చెప్పిన ముద్రగడపై సహచరుల నుంచి కూడా ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ముద్రగడ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

క్లుప్తంగా

అమ్మమ్మ మందలించిందని ఆత్మహత్య

నల్లజర్ల: అమ్మమ్మ మందలించిందనే మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. నల్లజర్ల ఎస్సై నరసింహమూర్తి కథనం ప్రకారం.. తడికలపూడి సమీపంలోని సాగిపాడుకు చెందిన శీలంశెట్టి గీత (18) చిన్నప్పటి నుంచీ ఆవపాడులోని అమ్మమ్మ ఉన్నమట్ల లక్ష్మి ఇంటి వద్ద ఉంటోంది. గ్రామ శివారున ఉన్న శ్రీచక్ర పాల ఫ్యాక్టరీలో పనికి వెళ్తోంది. ఇటీవల గీత ఇంట్లో పనులు చేయకుండా ఖాళీ సమయంలో తరచూ ఫోన్ చూస్తోందని అమ్మమ్మ లక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన గీత.. ఈ నెల 14న ఎలుకల మందు తింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గీత మంగళవారం మృతి చెందింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రిమాండుకు ఆటో ప్రమాద నిందితులు

తాళ్లరేవు: మండలంలోని సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు రిమాండుకు తరలించారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ మంగళవారం ఈ విషయం తెలిపారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపి, ఏడుగురి మృతికి, మరో ఏడుగురు గాయపడటానికి కారకులైన బస్సు డ్రైవర్ వేగిరాజు సుధీర్, క్లీనర్ ముంగమూరి మహేష్‌లపై పోలీసులు 304, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీరిద్దరినీ అరెస్టు చేసి, స్పెషల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎ.నాగమల్లేశ్వరి ఎదుట హాజరు పరిచారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఏడుగురూ కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రాణాలు తీసిన పంక్చర్

- యర్నగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- టైరు పేలి, డివైడర్ పైనుంచి కారు పల్టీలు
- ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీకొట్టిన వైనం
- ముగ్గురి దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు


రాధాకృష్ణస్వామి, చక్రవర్తి మృతదేహాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూరు డీఎస్పీ వర్మ, సీఐ శ్రీనివాసరావు

దేవరపల్లి: అప్పటి వరకూ హాయిగా.. సాఫీగా సాగిపోతున్న ప్రయాణంలో ఒక్కసారిగా పెద్ద కుదుపు.. వారు ప్రయాణిస్తున్న కారు టైరు ఒక్కసారిగా పంక్చరైంది. దీంతో వేగంగా వెళ్తున్న ఆ కారు అదుపు తప్పి, డివైడర్ పైనుంచి పల్టీలు కొడుతూ.. రోడ్డు డివైడర్‌కు అవతలి వైపు దూసుకువెళ్లి.. ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను బలంగా ఢీకొంది. పదహారో నంబర్ జాతీయ రహదారిపై గుండుగొలను – కొవ్వూరు మధ్య.. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యర్నగూడెం గండి చెరువు సమీపాన జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం ముగ్గురిని బలి తీసుకుంది.

కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం నేతాజీ నగర్‌కు చెందిన పట్నాల దిగ్విజయ రాధాకృష్ణ స్వామి (47) కృష్ణా జిల్లా వీరవల్లి పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఈఓగా, ఆయన భార్య శ్యామల కొవ్వూరు మండలం దొమ్మేరు పీహెచ్‌సీలో ఫార్మసిస్టుగా పని చేస్తున్నారు. రాధాకృష్ణస్వామి తన కారులో మంగళవారం రాజమహేంద్రవరం నుంచి విధి నిర్వహణ కోసం వీరవల్లి బయలుదేరారు. ఉదయం 11 గంటల సమయానికి యర్నగూడెం చేరేసరికి కారు ముందు టైరు ఒక్కసారిగా పంక్చరైంది. దీంతో ఆ కారు అదుపు తప్పి, పల్టీలు కొడుతూ రోడ్డు డివైడర్ పైనుంచి అవతలి రోడ్డు మీదకు అత్యంత వేగంగా దూసుకు వెళ్లి బోల్తా పడింది. అదే సమయంలో ఏలూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు కంటైనర్ లారీ వస్తోంది. ప్రమాదాన్ని గమనించి కంటైనర్ డ్రైవర్ కారును తప్పించేందుకు విఫలయత్నం చేశాడు. అప్పటికే చేరువైపోవడంతో కారును కంటైనర్ ఢీకొని కొంత దూరం ఈడ్చుకు వెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. కారును ఢీకొన్న కంటైనర్ అనంతరం ముందు వెళుతున్న మినీ వ్యాన్‌ను కూడా ఢీకొంది. దీంతో ఆ వ్యాన్ బోల్తా పడింది.

యాప్‌లో ఫాలో అయి..

ప్రమాద సమయానికి కారులో నలుగురు వ్యక్తులు ఉన్నారు. రాధాకృష్ణస్వామి కారు నడుపుతున్నారు. విధులకు బయలుదేరే ముందు తాను కారులో విజయవాడ వెళ్తున్నానని, కారు ఖాళీగా ఉందని సంబంధిత యాప్‌లో పెట్టారు. దీనిని వేమగిరికి చెందిన కాకి చక్రవర్తి (30), రాజమహేంద్రవరం తారక నగర్‌కు చెందిన బందుబోడే తులసీరామ్ (32), రాజమహేంద్రవరానికే చెందిన షేక్ ఇస్మాయిల్ గమనించారు. వీరు వేర్వేరు ప్రాంతాల్లో రాధాకృష్ణస్వామి కారు ఎక్కారు. ప్రమాదంలో రాధాకృష్ణస్వామితో పాటు చక్రవర్తి అక్కడికక్కడే మృతి చెందారు. తులసీరామ్, కారులో వెనుకన కూర్చున్న షేక్ ఇస్మాయిల్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో తులసీరామ్ మృతి చెందారు. ఇస్మాయిల్ రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కంటైనర్ ఢీకొనడంతో బోల్తా పడిన మినీ వ్యాన్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు.

మృతుడు రాధాకృష్ణ దంపతులకు మెడిసిన్ చదువుతున్న కుమార్తె, ఇంజినీరింగ్ చదువుతున్న కుమారుడు ఉన్నారు.

మృతదేహాలకు కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. దేవరపల్లి సీఐ ఎ.శ్రీనివాసరావు, ఎస్సై కె.శ్రీహరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద స్థలాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హుటాహుటిన సందర్శించి, మృతదేహాలను పరిశీలించారు. వివరాలు తెలుసుకుని, మృతదేహాలను బంధువులకు అప్పగించాలని పోలీసులకు సూచించారు.

పుట్టిన బిడ్డను చూద్దామని బయలుదేరి..

ఈ ప్రమాదంలో మరో మృతుడు తులసీరామ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. తులసీరామ్ భార్య ఏలూరు ఆశ్రమ్ ఆసుపత్రిలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ ఆనందంతో.. పుట్టిన బిడ్డను కళ్లారా చూసి, ముద్దాడాలనే ఆనందంతో తులసీరామ్ ఏలూరు బయలుదేరాడు. చివరకు ఆ బిడ్డను చూడకుండానే మార్గం మధ్యలో ఈ ప్రమాదంలో మృతి చెందాడు. కన్న బిడ్డను చూడకుండానే కారు ప్రమాద రూపంలో తులసీరామ్‌ను మృత్యువు కబళించిందని అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

కొత్త కారు తీసుకురావడానికి వెళుతూ..



ఈ ప్రమాదంలో మృతి చెందిన కాకి చక్రవర్తి (30) రాజమహేంద్రవరంలోని ఎంజీ షోరూములో పని చేస్తున్నాడు. కొత్త కారు తీసుకు రావడానికి ఈ కారులో విజయవాడ బయలుదేరిన అతడు ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. అతడికి భార్య, నాలుగేళ్లు, ఏడాదిన్నర వయస్సు కుమారులు ఇద్దరు ఉన్నారు.

కొనసాగిన ఈఏపీ సెట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలు రెండో రోజైన మంగళవారం ఉదయం, మధ్యాహ్నం ప్రశాంతంగా జరిగాయి. కాకినాడ జిల్లాలో 1,170కి 1,126 మంది, తూర్పు గోదావరిలో 1,405కు 1,347 మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 671కి 654 మంది పరీక్షలకు హాజరయ్యారు.

జీఓ నంబర్-1 అమలుకు న్యాయ పోరాటం


పోస్టర్ విడుదల చేస్తున్న న్యాయవాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇరుకు సందుల్లో సమావేశాలు నిర్వహించకుండా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించే జీఓ నంబర్-1 అమలు కోరుతూ న్యాయపోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సాధిక్ హుస్సేన్, కార్యదర్శి పీవీవీఎస్‌బీ రాజు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, లోకేష్ ఇరుకు సందుల్లో సమావేశాలు ఏర్పాటు చేయడం వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం జీఓ నంబర్-1 జారీ చేసిందని గుర్తు చేశారు. దీనిపై విపక్షాలు కోర్టుకు వెళ్లడంతో హైకోర్టు కొట్టివేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ జీఓ అమలు కోసం తాము న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. మరో న్యాయవాది ఎస్.ప్రవీణ్ కుమార్, ఎండీ హసీనా బేగం మాట్లాడుతూ, ఎంపీ మార్గాని భరత్‌రామ్ నగర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా 'అమరావతి భూ బకాసురులు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. విలేకర్ల సమావేశంలో న్యాయవాదులు గుత్తుల వెంకట కిరణ్ కుమార్, ఎం.హేమంత్ కుమార్, పిల్లి రమ్యనాగిని పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీల బాట

- ఒంటరి మహిళలు, మెడలోని గొలుసులే వారి టార్గెట్
- పెద్దాపురంలో ముగ్గురు చైన్‌స్నాచర్ల అరెస్టు
- రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాల స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

పెద్దాపురం: మద్యపాన వ్యసనం, బెట్టింగ్‌లతో పాటు జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు యువకులు చోరీల బాట పట్టారు. ఎక్కడపడితే అక్కడ చైన్‌స్నాచింగ్‌లు చేసి, ఆ ఆభరణాలను అమ్మి, జల్సాగా జీవితం గడపడం మొదలు పెట్టారు. చివరకు పెద్దాపురం పోలీసులకు అడ్డంగా దొరికిపోయి కటకటాల పాలయ్యారు. పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ లతాకుమారి, సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై వి.సురేష్ ఈ వివరాలు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన పట్టా వరప్రసాద్, పాతంశెట్టి హరిబాబు స్నేహితులు. ఇద్దరూ బెట్టింగ్‌లకు పాల్పడి డబ్బులు పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో జగ్గంపేటలోని ఓ మద్యం షాపు వద్ద మద్యం తాగుతున్న సమయంలో వారికి.. పెద్దాపురం మండలం తూర్పుపాకల గ్రామానికి చెందిన కొరిమెర్ల సతీష్ పరిచయమయ్యాడు. అనంతరం ఈ ముగ్గురూ చెడు వ్యసనాలకు బానిసలవడంతో పాటు బెట్టింగ్‌లకు, జల్సాలకు అలవాటు పడ్డారు. దీని కోసం చోరీల బాట పట్టారు. ఇందులో భాగంగా ఈ ముగ్గురు యువకులూ గత ఏడాది అక్టోబర్ 17వ తేదీన పెద్దాపురం సత్తిరెడ్డిపేటలో ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును బైక్‌పై వచ్చి లాక్కుని పరారయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం గత నెల 22వ తేదీన నువ్వుల గుంట వీధిలోని ఓ మహిళ మెడలో అదేవిధంగా చైన్ లాక్కుని ఈ ముగ్గురూ పరారయ్యారు. దీనిని తీవ్రంగా పరిగణించిన పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీన పాండవుల మెట్ట సమీపాన బైక్‌పై ముగ్గురు యువకులూ దొంగిలించిన బంగారం అమ్మేందుకు కాకినాడ వెళ్తున్నారు. వారిని సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై సురేష్ అదుపులోకి తీసుకుని విచారించగా, గొలుసు దొంగతనాల విషయం బయటపడింది. ఈ ముగ్గురూ గతంలో కాకినాడ, జగ్గంపేట, గండేపల్లి, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుల నుంచి సుమారు రూ.8 లక్షల విలువైన 151 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులనూ కోర్టుకు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ నబీ, ఎస్సై సురేష్, సీసీఎస్ ఎస్సై విజయ్‌కుమార్, హెడ్ కానిస్టేబుళ్లు బలరాం, రాధాకృష్ణ, నాగరాజు, కానిస్టేబుళ్లు సూర్యచంద్ర, నాగేంద్రలను డీఎస్పీ లతాకుమారి ప్రత్యేకంగా అభినందించారు.

పాపం పసివాడు

- అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుతుండగా మెడకు తాడు బిగుసుకుని మృతి
- సిబ్బందిపై కేసు నమోదు చేయాలని స్థానికుల ఆందోళన
- బాధితులను పరామర్శించి, సముదాయించిన మంత్రి వేణు


మృతుడు మనోజ్ చంద్రశేఖర్


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తులసీరామ్, ఆర్ఐ వేగేశ్వరరావు


మృతుని కుటుంబీకులను పరామర్శించి, ఓదార్చుతున్న మంత్రి వేణు

కాజులూరు: ఊయల తాడుకు, ఉరి తాడుకు తేడా తెలియని ఆ పసివాడు.. అంగన్‌వాడీ కేంద్రంలో ఆడుకుంటున్న క్రమంలో.. మెడకు తాడు బిగుసుకుని మృతి చెందాడు. ఈ విషాద సంఘటన కాకినాడ జిల్లా కాజులూరు మండలం గొల్లపాలెంలో జరిగింది. గ్రామంలోని అగ్నికుల క్షత్రియులపేటకు చెందిన శేరు సత్తిబాబు ఆర్క్ వెల్డింగ్ పని చేస్తూంటాడు. అతడి భార్య నాగలక్ష్మి రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో రోజు కూలీగా పని చేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు ఆరో తరగతి చదువుతున్నాడు. ఐదో తరగతి చదువుతున్న మనోజ్ చంద్రశేఖర్ (9) మంగళవారం తన చెల్లెలిని అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకు వెళ్లాడు. అక్కడి ఆయా కేంద్రం తలుపులు తీసి, మిగిలిన పిల్లలను తీసుకు వచ్చేందుకు గ్రామంలోకి వెళ్లింది. చెల్లెలితో కలసి చంద్రశేఖర్ లోపలకు వెళ్లాడు. ఆ కేంద్రంలో ప్రతి నెలా పిల్లల బరువు తూచేందుకు ఫ్యాన్ హుక్‌కు తగిలించి ఉన్న తాడు పట్టుకుని ఊయల ఊగాడు. ఆపై ఒక పీట వేసుకుని దాని పైకి ఎక్కి, వేలాడుతున్న తాడును మెడకు తగిలించుకుని ఊయల ఊగబోయాడు. అంతలో పీట పక్కకు జరిగిపోవటంతో తాడు మెడకు బిగుసుకుని మృతి చెందాడు. గమనించిన చిన్నారులు భయంతో కేకలు వేశారు. కొద్దిసేపటికి అక్కడికి వచ్చిన అంగన్‌వాడీ ఆయా స్థానికుల సహకారంతో తాడుకు వేలాడుతున్న మనోజ్ చంద్రశేఖర్‌ను కిందికి దించి, గ్రామంలోని ప్రైవేటు వైద్యునికి చూపించారు. అప్పటికే చంద్రశేఖర్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. స్థానికులతో కలివిడిగా తిరిగే ఆ పసివాడు ఆకతాయితనంగా తాడుతో ఆడుతూ, అది మెడకు బిగుసుకుని మృతి చెందటంపై గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పిల్లల తూకం పని పూర్తయిన తర్వాత వేలాడుతున్న తాడును తొలగించకుండా వదిలేసినందు వల్లనే తమ బిడ్డ మృతి చెందాడని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంగన్‌వాడీ సిబ్బందిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. గొల్లపాలెం ఎస్సై తులసీరామ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేగేశ్వరరావు తదితరులు చంద్రశేఖర్ మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టానికి తరలించేందుకు ప్రయత్నించారు. అందుకు బంధువులు అంగీకరించలేదు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంగన్‌వాడీ సిబ్బందిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేయిస్తామని, మృతుని కుటుంబీకులకు ప్రభుత్వం నుంచి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ధాన్యం రైతుకు ప్రభుత్వం దన్ను


జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: గత టీడీపీ పాలకులు రైతన్నను నిర్లక్ష్యం చేస్తే.. వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. తన చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతుభరోసా మొదలు పంట నష్ట పరిహారం వరకూ ప్రభుత్వం సకాలంలో అందజేస్తూ రైతులకు ధైర్యానిస్తోందన్నారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టం వాటిల్లితే.. వెంటనే అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దింపి, సత్వరం అంచనాలు రూపొందించి, అతి తక్కువ కాలంలోనే రైతులకు పరిహారం అందిస్తోందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతోందని, అప్పటి నుంచీ వర్షాలు సైతం పుష్కలంగా కరుణిస్తున్నాయని, కాలువల్లో నీరు సమృద్ధిగా ఉంటూ అటు పంటల సాగుకు, ఇటు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేపట్టి, రైతుకు ప్రభుత్వం దన్నుగా నిలుస్తోందని తెలిపారు. తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేసిందని, ఎక్కడైనా ధాన్యం కొనుగోలు చేయనట్టు జెడ్పీటీసీ సభ్యుల దృష్టికి వస్తే ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాల్సిందిగా కోరామని తెలిపారు.

పదో తరగతి పరీక్షల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని విప్పర్తి అన్నారు. ఏజెన్సీలోని పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల స్థితిగతులు పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులు ఉన్నారని, ఆ ప్రాంతం కొత్త జిల్లా ఏర్పడటంతో స్వయంగా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పర్యవేక్షణలో సమస్యలు పరిష్కరిస్తారన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా పశుపక్ష్యాదులకు తాగునీరు, కాలువల్లో నీరు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఇరిగేషన్ అధికారులను కోరామని చెప్పారు. హాస్టళ్లలో మెనూ ప్రకారం ఆహారం అందించాలని, దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేస్తోందని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి ఆదేశించారు.

20న ఏపీ గురుకులం ప్రవేశ పరీక్షలు

తుని రూరల్: ఆంధ్ర ప్రదేశ్ గురుకులాల్లో ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిఉన్న సీట్లకు, ఏపీఆర్‌జేసీ అండ్ ఏపీఆర్‌డీసీ సెట్స్ ప్రవేశ పరీక్షలు ఈనెల 20న జరుగుతాయి. తుని మండలం జగన్నాథగిరిలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వెంకటలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 15 నుంచి ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పోస్టల్ ద్వారా పంపించరన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయాలన్నారు. ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు ఉదయం తొమ్మిది గంటల నుంచి పరీక్ష జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ (ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్)లకు కాకినాడలో ఏర్పాటు చేసిన ఆరు కేంద్రాల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరవ్వాలన్నారు.

ఇంటిని, ఇంట్లోని వస్తువులనూ చక్కబెట్టేసింది


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ గణేష్, ఎస్సై కేశవరావు

ధవళేశ్వరం: పనిలోకి కొత్తగా చేరింది.. రెండు రోజుల్లోనే ఇంటితో పాటు ఇంట్లోని వస్తువులనూ చక్కబెట్టేసింది. ఒకటీ రెండూ కాదు.. సుమారు రూ.10 లక్షల విలువైన 201 గ్రాముల బంగారు ఆభరణాలను దోచేసింది. చివరకు పోలీసులకు చిక్కింది. ఈ వివరాలను రాజమహేంద్రవరం సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. స్థానిక క్వారీ కెనాల్ రోడ్డులో నివాసం ఉంటున్న జెర్రిపోతుల శిల్ప ఇంట్లో టిడ్కో ఇళ్లల్లో నివాసం ఉంటున్న పిల్లి త్రిపుర రెండు రోజుల క్రితం పనికి చేరింది. ఈ నెల 9న ఫంక్షన్‌కు వెళ్లి వచ్చిన శిల్ప బంగారు గాజులు, చెవిబుట్టలను బాక్సులో పెట్టి డైనింగ్ టేబుల్ మీద మరచిపోయారు. 13వ తేదీన మరో ఫంక్షన్‌కు వెళ్లేందుకు బీరువాలో గాజుల కోసం చూడగా బాక్సు కనిపించలేదు. దీంతో కొత్తగా ఇంట్లో చేరిన పనిమనిషిపై అనుమానం వచ్చి, బాధితులు ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పనిమనిషి త్రిపురను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. ఆమె వద్ద 176 గ్రాముల బరువైన 16 బంగారు గాజులు, 25 గ్రాముల చెవిబుట్టలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించిన డీఎస్పీ శ్రీనివాసులు, ధవళేశ్వరం ఇన్‌చార్జి సీఐ టి.గణేష్, ఎస్సై ఎం.కేశవరావు, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు డి.శ్రీనివాస్, టి.వెంకటేశ్వరరావులను ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అభినందించారు. కేసును ఛేదించిన పోలీసులకు రివార్డు అందజేస్తామని డీఎస్పీ శ్రీనివాసులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో జట్టు కూలీ మృతి


మృతుడు సత్యనారాయణ (ఫైల్)

అయినవిల్లి/అంబాజీపేట: ఆరుగాలం కష్టపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న ఓ జట్టు కూలీని ఊహించని విధంగా మృత్యువు కబళించింది. దీంతో ఆ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. అంబాజీపేట మండలం పసుపల్లికి చెందిన నందికోళ్ల సత్యనారాయణ (47), వక్కపట్ల కృష్ణ, యర్రంశెట్టి సన్నిబాబులు.. అయినవిల్లి మండలం మడుపల్లి వద్ద రహదారిపై ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌పై లోడు చేశారు. అనంతరం బస్తాలకు పగ్గాలు బిగిస్తున్నారు. అదే సమయంలో కొత్తపేట నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఈ ముగ్గురు కూలీలను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. కృష్ణ, సత్యసాయి తీవ్రంగా గాయపడ్డారు. వారిని అమలాపురం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కృష్ణను కాకినాడ తరలించారు. మృతుడు సత్యనారాయణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సన్నిబాబు ఫిర్యాదు మేరకు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. సత్యనారాయణ మృతితో పసుపల్లిలో విషాద ఛాయలు అలముకున్నాయి. కొద్ది నిమిషాల్లో ఇంటికి వస్తాడని ఎదురు చూస్తుంటే అతడి మృత్యువార్త వినాల్సి వచ్చిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు అక్కడి వారిని కలచి వేసింది. సత్యనారాయణ అందరితో కలసిమెలసి ఉండేవాడని, అతడు లేడనే విషయం జీర్ణించుకోలేకపోతున్నామని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీమున్నీరయ్యారు.